

	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	35	24
భద్రాద్రి	37	25

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సా) : 6:24 (గురువారం)
సహర్ (ఉ) : 4:57 (శుక్రవారం)

ఆగస్టు నాటికి వైరాకు గోదావరి జలాలు

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


వైరా రిజర్వాయర్ వద్ద లింక్ కెనాల్‌కు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎంభట్టి , మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి తదితరులు

- వైరా రిజర్వాయర్ వద్ద సీతారామ లింక్ కెనాల్‌కు శంకుస్థాపన
- ముఖ్యఅతిథులుగా డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి
- సమయాభావంతో సభలో పాల్గొనకుండానే వెళ్లిపోయిన ముగ్గురు మంత్రులు

వైరా, మార్చి 13: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరిపై చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఖమ్మం జిల్లా వైరా రిజర్వాయర్‌కు నీరందించేందుకు రూ.99.16 కోట్లతో చేపట్టిన 18ఎల్ డిస్ట్రిబ్యూటరీ, మెయిన్ కెనాల్ 100.225 కిలోమీటర్ సర్ప్లస్ రెగ్యులేటర్ నిర్మాణానికి బుధవారం సాయంత్రం వైరాలో రిజర్వాయర్ కుడికాల్వ వద్ద డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులు శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు.

హెలీకాప్టర్‌లో సాంకేతిక సమస్యలతో ఈ కార్యక్రమం ఆలస్యం కావడంతో శంకుస్థాపన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయారు. ఆ తరువాత జరిగిన బహిరంగ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రమే పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించడమే తన జీవితాశయమన్నారు. ఆగస్టు నాటికి గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు తీసుకువస్తామని ప్రకటించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులు సహా ఎన్నెస్పీ ఇతర ఆయకట్టులోని 1.25లక్షల ఎకరాలకు గోదావరి జలాలను అందిస్తామని వెల్లడించారు. గోదావరి జలాలను తీసుకురావడానికి అవసరమైన నిర్మాణాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని అనుమతులిచ్చారని స్పష్టం చేశారు.

ఇప్పటికే సీతారామ ప్రాజెక్టు మూడుఎత్తిపోతల పథకాలు, ప్రధాన కాల్వ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నుంచి పది లక్షల ఎకరాలకు సాగునీరందించటం తన జీవిత లక్ష్యమని అయితే నిర్మాణాలు మొత్తం పూర్తయ్యేవరకు ఆగకుండా ఇప్పుడు కేవలం రూ.వందకోట్లతో 1.25లక్షల ఎకరాలకు మూడ్నాలుగు నెలల్లో గోదావరి జలాలను పారిస్తామని స్పష్టం చేశారు. భద్రాచలం శ్రీరాముని దయ వల్ల సీఎం రేవంత్‌రెడ్డి అన్ని అనుమతులు ఇచ్చారని వ్యాఖ్యానించారు. ముందుగా ఇతర పనులు ఉన్నప్పటికీ కాల్వల నిర్మాణం పూర్తి చేసి తిమ్మారావుపేట వద్ద ఏటి ద్వారా వైరాకు గోదావరి జలాలు తీసుకువస్తామని స్పష్టం చేశారు. సత్తుపల్లి ట్రంక్ నిర్మాణం కూడా చేపడతామని ఇందుకు అవసరమైన నిధులు రూ.70కోట్లు మంజూరు చేస్తామని తెలిపారు. వైరా, లంకాసాగర్‌కు గోదావరి జలాలు రావడం ద్వారా మధిర బ్రాంచ్ కెనాల్ ద్వారా డిప్యూటీ సీఎం నియోజకవర్గమైన మధిరకు నిరంతరాయంగా గోదావరి జలాలు సరఫరా అవుతాయని ఆ నియోజకవర్గానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

సభా వేదికపైకి సీతారామ ప్రాజెక్టు సీఈ ఏ.శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ ఎస్.శ్రీనివాసరెడ్డి తదిర అధికారులను పిలిపించి 18ఎల్, రెగ్యులేటర్ కాల్వలను ఎప్పటివరకు పూర్తిచేస్తారని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. దాంతో వారు ఆగస్టు నాటికి పూర్తిచేస్తామని సమాధానమివ్వగా అందుకు మంత్రి తుమ్మల స్పందిస్తూ తాను సీఎం రేవంత్‌రెడ్డి అనుమతితో ఆగస్టు వరకు నీళ్లిస్తామని చెప్పామని, ఎట్టిపరిస్థితుల్లోనూ జూన్ చివరినాటికి గోదావరి జలాలను వైరా ఏటి ద్వారా రిజర్వాయర్‌కు తీసుకురావాల్సిందేనని తుమ్మల స్పష్టం చేశారు. తుమ్మల సూచనలతో అధికారులు కూడా జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేస్తామని ప్రకటించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి నిరంతరం నిర్మాణాలను పరిశీలిస్తుంటామని స్పష్టం చేశారు. వైరా నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క అండగా ఉంటారని, ఆ సమస్యలను పరిష్కరించకపోతే ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి రానివ్వకుండా అడ్డుకోండంటూ మంత్రి తుమ్మల చమత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మలను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మట్టా రాగమయి, కలెక్టర్ వీపీ గౌతమ్, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.



సాంకేతిక లోపంతో మధిరలో నిలిచిపోయిన హెలీకాప్టర్

రెండు గంటలు ఆలస్యంగా...

శంకుస్థాపన కార్యక్రమం నిర్ణీత సమయానికంటే రెండుగంటలకు పైగా ఆలస్యమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మధిర నుంచి హెలీకాప్టర్‌లో 4.30గంటలకు రావల్సి ఉంది. కానీ కోదాడలో హెలీకాప్టర్‌లో సాంకేతిక సమస్య కారణంగా వారు మధిరకు 4.50గంటలకు చేరుకున్నారు. అక్కడ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం హెలీకాప్టర్‌లో వైరా రావల్సి ఉండగా మళ్లీ అక్కడ హెలీకాప్టర్ మొరాయించడంతో వారు రోడ్డు మార్గంలో వైరాకు రావాల్సి వచ్చింది. దాంతో వారు సాయంత్రం 6గంటల తర్వాత వైరాకు చేరుకున్నారు. అదే సమయానికి మధిరలో మొరాయించిన హెలీకాప్టర్ వైరా హెలీప్యాడ్‌కు చేరుకుంది. దీంతో హడావుడిగా శంకుస్థాపన చేసిన తర్వాత అనంతరం మంత్రి తుమ్మల మినహా ముగ్గురు మంత్రులు సభలో పాల్గొనకుండానే హెలీకాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లిపోయారు.

మంత్రి తుమ్మల కూడా వారితోపాటే హెలీకాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లాల్సి ఉండగా సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీసుకురావడం తన జీవితాశయమైనందున ఈ సభలో పాల్గొంటానని తుమ్మల వివరించారు. గురువారం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రానుండటంతో పార్టీ ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున ముగ్గురు మంత్రులు హెలీకాప్టర్‌లో వెళ్లారని, ప్రజలకు గోదావరి జలాల రాక గురించి వివరించి తాను మాత్రం రోడ్డుమార్గంలో హైదరాబాద్ వెళ్తానని తుమ్మల వివరించారు.

సరదాగా కాసేపు...



రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ బుధవారం సాయంత్రం వైరా రిజర్వాయర్ వద్ద ఆటవిడుపుగా కొంతసేపు కాలక్షేపం చేశారు. లింక్ కాల్వ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు మధిర నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రావాల్సి ఉండగా, హెలీకాప్టర్ మొరాయించిన కారణంగా వారి రాక ఆలస్యమైంది. అప్పటికే రోడ్డు మార్గంలో వైరా చేరుకున్న మంత్రులు పొంగులేటి, తుమ్మల కలెక్టర్ గౌతమ్‌తో కలిసి రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. ఆనకట్టపై ఉన్న సిమెంట్ బెంచీపై పొంగులేటి కూర్చోగా, తుమ్మల రెయిలింగ్‌కు ఆనుకొని నిలబడి కలెక్టర్‌తో ముచ్చటించారు. ముగ్గురూ అల్పాహారం తీసుకొని దాదాపు 30 నిమిషాలకుపైగా ఆనకట్టపై గడిపారు. -వైరా


ఖమ్మం నగరంలో నూతన గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఆధునిక హంగులతో గ్రంథాలయం

- భవన నిర్మాణానికి రూ.2.80 కోట్లు మంజూరు
- త్వరలో అందుబాటులోకి తేవాలి: తుమ్మల, పొంగులేటి
- సిటీ గ్రంథాలయం ఆవరణలో శంకుస్థాపన 4

ఒక రోజు.. నలుగురు మంత్రులు

కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఖమ్మం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలకు గురువారం షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో ఖమ్మం జిల్లాలో బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ముగ్గురు మంత్రులు విస్తృతంగా పర్యటించారు. ఖమ్మం నగరంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించి నూతన గ్రంథాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రఘునాథపాలెం మండల పరిధిలో ఖమ్మం మెడికల్ కళాశాలకు స్థల పరిశీలన చేశారు.ఆ తరువాత ఈ ఇద్దరు మంత్రులు తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి కూసుమంచి మండలంలో పర్యటించారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిర మండలంలో భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పర్యటించారు. అనంతరం వైరాలో జరిగిన సీతారామ లింక్ కెనాల్ శంకుస్థాపన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టితో పాటు మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



జోన్-2లోకి ఎన్నెస్పీ ఆయకట్టు

- భట్టి వినతి మేరకు వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తున్న..
- ఎర్రుపాలెం, మధిర రైతులకు ఎంతో ఉపయుక్తం 4
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- మధిరలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

- పోరాటాల ద్వారానే ప్రజా మద్దతు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 13: ఎటువంటి రాజకీయ పరిస్థితులు ఏర్పడిన రాజ్యాంగాన్ని రక్షించుకోవటమే కమ్యూనిస్టుల కర్తవ్యమని, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయటం ద్వారానే ప్రజా మద్దతు ఎప్పుడు ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. మతోన్మాదశక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలోని ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. సీపీఎం కార్యాలయం సుందరయ్య భవన్‌లో కొమ్ము శ్రీను అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో తమ్మినేని నాయకులకు మార్గదర్శనం చేశారు. దేశంలో రాజీయ పరిస్థితులు వేగంగా మార్పు చెందుతున్నాయని, మతోన్మాదశక్తులు రాజ్యాంగాన్ని మార్పు చేసి మనువాదాన్ని అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. దానిని తిప్పి కొట్టటమే కమ్యూనిస్టుల ప్రథమ కర్తవ్యంగా ముందుకు రావాలని తమ్మినేని పిలుపునిచ్చారు.

రాబోయే ఎన్నికలపై మతోన్మాద శక్తుల ప్రభావం ఉంటుందని, వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. బీజేపీ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మార్లేందుకు మతాన్ని అడ్డుపెట్టుకొని ప్రచారం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటిస్తున్న ఆరు గ్యారెంటీ పథకాల్లో అవకతవకలు జరగకుండా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు దృష్టి సారించి వాటి పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు బుగ్గవీటి సరళ, సంద్ర ప్రసాద్, ఊరిటి సుదర్శన్‌రెడ్డి, గోడవర్తి నాగేశ్వరరావు, ఎడవల్లి రమాణరెడ్డి, అంగిరేకుల నర్సయ్య, వీరన్న, తాళ్లూరి నాగేశ్వరరావు, దాసరి మహేందర్, బింగి రమేశ్, సర్వంతరావు, తుపాకుల లింగయ్య పాల్గొన్నారు.

'లెఫ్ట్' రూటు ఎటు!?

- లోక్‌సభ ఎన్నికల్లో పోటీపై తేల్చుకోలేకపోతున్న వామపక్షాలు
- ఒంటరిగా పోటీ ఆలోచనలో సీపీఎం
- ఒక్క సీటిచ్చినా కాంగ్రెస్‌తో కలిసి సాగుతామంటున్న సీపీఐ
- తుది నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి



ఖమ్మం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నేడో, రేపో లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ రాబోతున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికలపై ముమ్మర కసరత్తు చేస్తుండగా జిల్లాలో కీలకమైన వామపక్షాలు మాత్రం పోటీ విషయమై ఎటూ తేల్చుకోలేకపోతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి సీపీఐ పోటీలో నిలవగా, సీపీఎం ఒంటరిగా పోటీ చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం సీపీఐ, సీపీఎం పార్టీలు ఇంకా తమ నిర్ణయాన్ని వెలిబుచ్చలేదు. దీనిపై ఆయా పార్టీల కేడర్‌లోనూ స్పష్టత కరువైంది. సీపీఎం మాత్రం జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలకు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతోంది. అయితే అభ్యర్థులు ఎవర్నది ఇంకా తేలలేదు. గతంలో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో సీపీఎం కీలక పాత్ర పోషించేది. పలు ఎన్నికల్లో ఖమ్మం, భద్రాచలం నుంచి సీపీఎం అభ్యర్థులు గెలిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ రెండు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం ఒంటరిగా పోటీ చేసి అన్నీ నియోజకవర్గాల్లో ఓడిపోయింది. 2018లో బీఎల్‌ఎఫ్ పేరుతో కూటమిగా పోటీ చేసి కూడా ఓటమి చెందింది. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ ఒంటరిగా పోటీ చేసి తన ఓటుబ్యాంకును నిలబెట్టుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం తన ఓటు బ్యాంకును గణనీయంగా కోల్పోయింది. అయినా లోక్‌సభ ఎన్నికల్లోనూ సీపీఎం మళ్లీ ఒంటరిపోరు ప్రయత్నాల్లో ఉంది. అయితే దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో ఉన్న సీపీఎం రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేస్తుం దా లేక కాంగ్రెస్‌తో కలిసి ప్రయాణం సాగిస్తుం దా అన్నది తేలాల్సి ఉంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ కూడా లౌకిక పార్టీగా ఉన్నందున ఇండియా కూటమిని కాదని సీపీఎం ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటుందా అనే విషయంపై కూడా స్పష్టత రావాల్సి ఉంది.

అసెంబ్లీ పొత్తు లోక్‌సభకూ కొనసాగేనా..?

ఇక సీపీఐ విషయంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి ప్రయాణించిన ఆ పార్టీ కొత్తగూడెం అసెంబ్లీ స్థానాన్ని దక్కించుకుంది. అక్కడినుంచి పోటీ చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో కుదిరిన పొత్తు లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని చెబుతున్నా తమకు రాష్ట్రంలో ఒక లోక్‌సభ సీటైనా కేటాయించాలని ఆ పార్టీ కోరుతోంది. అందుకోసం ఆ పార్టీ ఐదు నియోజకవర్గాల పేర్లను కాంగ్రెస్‌కు అందించింది. అందులో ఖమ్మం కూడా ఉంది. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క సీటు కూడా సీపీఐకి ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ కోరుతున్నట్లు ఆ పార్టీకి సీటు ఇవ్వని పక్షంలో కాంగ్రెస్‌కు సహకరిస్తుందా అన్నది తేలాల్సి ఉంది. సీపీఐ కూడా దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో కాంగ్రెస్‌తో ప్రయాణం సాగిస్తోంది. గతంలో సీపీఐ ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో పోటీ చేసింది. కానీ రాష్ట్ర విభజన తర్వాత సీపీఐ లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించలేదు. ఉమ్మడి రాష్ట్రంలో భద్రాచలం ఎంపీ సీటును గెలిచిన చరిత్ర ఆ పార్టీకి ఉంది. ఇలాం టి పరిస్థితుల్లో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాల వైఖరిపై ఆసక్తి నెలకొంది.

మహబూబాబాద్ బీజేపీ అభ్యర్థిగా

సీతారాం నాయక్



ఖమ్మం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారతీయ జనతాపార్టీ రెండో జాబితాను బుధవారం విడుదల చేసింది. మహబూబాబాద్ ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గానికి మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ పేరును ఖరారు చేసింది. ఇటీవలనే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాషాయ కండువా కప్పుకున్నారు. 2014 లో మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంనుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2019 లో మాలోతు కవితకు టిక్కెట్ దక్కటంతో సీతారాం నాయక్ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ కవిత పేరును ప్రకటించింది. దీంతో అసంతృప్తి చెందిన సీతారాంనాయక్ బీజేపీలో చేరి టికెట్ సాధించారు. ఈ నియోజకవర్గం ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో విస్తరించి వున్న విషయం విదితమే.



మిర్చి రైతులు చూపు...

కోల్డ్ స్టోరేజీల వైపు..

- ధర తగ్గడంతో కోల్డ్ స్టోరేజీలకు క్యూ కడుతున్న రైతులు
- చోటు లేదని గేట్లకు తాళం వేస్తున్న యాజమాన్యాలు
- కిరాయి ధరల్లో వ్యత్యాసంతో రైతుల దిగాలు 4



15 ఏళ్ల పోరాటం

ఎట్టకేలకు ఫలించింది..

- 16 బీసీ కులాలకు కార్పొరేషన్ల ఏర్పాటుపై సంఘాల నేతల హర్షం 4
- సీఎం రేవంత్, మంత్రి తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం

భళా.. 'ఆరోగ్య మహిళ'

- మహిళలకు ప్రయోజనకారిగా మారిన కార్యక్రమం
- చికిత్స, పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా
- ప్రస్తుతం 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అమలు
- పలు రకాల వ్యాధులకు ఉచిత పరీక్షలు, చికిత్స
- క్షేత్రస్థాయిలో ప్రచారం చేపడితే మరిన్ని ఫలితాలు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 13: మహిళల ఆరోగ్య సమస్యలు పరిష్కరించి, వారికి తగిన సలహాలు, సూచనలు అందించేందుకు వీలుగా గత ఏడాది మార్చి 8 మహిళా దినోత్సవం రోజున ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లా పరిధిలో ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంపికచేసి అక్కడ ప్రత్యేకంగా మహిళ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతీ మంగళవారం ఇక్కడ మహిళలు తమ ఆరోగ్యస్థితిగతులను పరీక్షించుకోవచ్చు. ఏడాది క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమంతో మంచి సత్ఫలితాలిస్తోంది. రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ఆరోగ్య మహిళా చికిత్సలు, పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. మహిళల్లో అనేకమైన ఆరోగ్య పరీక్షలను నిర్వహించి వారికి చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చింది ఈ పథకం.

అనేక రకాల పరీక్షలు

మహిళలకు సంబంధించి ఆరోగ్య సమస్యలు ఎన్నో ఉంటాయి. వయసు ఆధారంగా ఇవి వస్తుంటాయి. చాలా మంది అనుమానాలు, అపోహలతో వాటిని నిర్లక్ష్యం చేస్తూ పరిస్థితిని తీవ్రం చేసుకుంటున్నారు. మహిళా క్లినిక్‌కు వెళ్లితే అక్కడంతా మహిళా సిబ్బందే ఉడడం వలన ఎలాంటి సందేహాలు లేకుండా తమ ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లొచ్చు. పరీక్షలు చేయించుకొని సమస్యలను నిర్ధరణ చేసుకోవచ్చు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం సిఫారసు చేస్తారు. క్లినిక్‌లో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చు. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత , థైరాయిడ్ పరీక్ష సూక్ష్మపోషకాల లోపాలను గుర్తిస్తారు. ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ తెలుసుకునేందుకు స్ర్కీనింగ్ చేస్తున్నారు.

అయోడిన్, పోలిక్ యాసిడ్, ఐరన్ లోపం, విటమిన్ బి 12, విటమిన్‌డి పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహిస్తున్నారు. మూత్రకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధుల పరీక్ష, మనోపాజ్‌దశకు సంబంధించిన పరీక్షలు హార్మోన్ రిప్లేస్‌మెంట్ థెరపీ ఉంటుంది, నెలసరి సంతాన సమస్యల నిర్ధారణ, లైంగిక అంటువ్యాధుల పరీక్షలు, బరువు నియంత్రణ లాంటి అంశాలను ఇక్కడ మహిళలకు పరీక్షలను నిర్వహిస్తున్నారు. చికిత్సలు, ఆరోగ్య కౌన్సిలింగ్ చేస్తున్నారు. చికిత్సకు అవసరమైన మందులు కూడా ఉచితంగానే అందిస్తున్నారు. అక్కడ వైద్య సదుపాయాలు అందుబాటులో లేకుంటే ఆధునిక ఆస్పత్రులకు సిఫారస్ చేస్తున్నారు.

ప్రచార లోపం అధిగమిస్తే..

మహిళల ఆరోగ్యం దృష్ట్యా ఇది మంచి కార్యక్రమమే అయినా.. క్షేత్ర స్థాయిలో కావాల్సినంత ప్రచారం లేకపోవడం లోటుగా మారుతోంది. ఆరోగ్య కేంద్రం చుట్టుపక్కల ఉన్నవారు, ఆశ కార్యకర్తల ప్రోద్బలంతో వచ్చేవారు తరులకు దీనిపై దీనిపై అవగాహన ఏర్పడటం లేదు. ప్రజల్లో చైతన్యం పెరిగితే మరింత మంది ఈ సేవలను వినియోగించుకునే ఆస్కారం ఉంటుంది. తొలుత ఐదు నియోజకవర్గాల్లో ఐదో చోట్ల ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినా దీనికి ఉన్న డిమాండ్ నేపథ్యంలో ఎంవీపాలెం, మంచుకొండ, ముదిగొండ, నేలకొండపల్లి, సుబ్లేడు, వేంసూరు, వైరా, బోనకల్, చెన్నూరు, కామేపల్లి, పాత మునిసిపాలిటీ ఖమ్మం మొత్తం 12 పీహెచ్‌సీల్లో ఈ కార్యక్రమం అమలుచేస్తున్నారు.

ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల వివరాలు:		
వివరాలు నమోదు చేసుకున్నవారు	:	13,621
థైరాయిడ్ పరీక్షలు	:	3,426
ఓరల్ కేన్సర్ పరీక్షలు	:	3,426
కేన్సర్‌పరీక్షలు నిర్వహించినది	:	3,426
అనుమానితులు	:	08
గర్భాశయ ముఖద్వార పరీక్షలు	:	2,604
అనుమానితులు	:	36
రొమ్ము కేన్సర్ నిర్ధారణ పరీక్షలు	:	2,603
అనుమానితులు	:	546
నిర్ధారించిన వారు	:	35
గర్భాశయ ముఖద్వార పరీక్షలు	:	1,894
అనుమానితులు	:	36
నిర్ధారించిన వారు	:	25
మోనోపాజ్ చికిత్సలు	:	116
మెరుగైన వైద్యం కోసం సిఫారసు	:	82



జిల్లా జనరల్ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సద్వినియోగించుకోవాలి.. : డాక్టర్ సైదులు, ఆరోగ్యమహిళ ప్రోగ్రాం ఆఫీసర్



మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమమిది. కొందరు కొన్ని రకా ల అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారు. నిజానికి ప్రధాన సమస్యలు ప్రాథమిక దశలోనే గుర్తిస్తేనే చికిత్స సులభంగా ఉంటుంది. తద్వారా దాని నివారణకు అవకాశంఉంటుంది. జిల్లా పరిధిలో ఎంపికచేసిన 12పీహెచ్‌సీ, యూపీహెచ్సీల్లో అందు బాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలి.



వైద్య పరీక్షల కోసం వచ్చిన మహిళలు

ఆధునిక హంగులతో నూతన గ్రంథాలయం

- ఆధునిక హంగులతో నూతన గ్రంథాలయం
- భవన నిర్మాణానికి రూ.2.80 కోట్లు మంజూరు

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 13: ఖమ్మం నగరం నడిబొడ్డున అందరికీ అందుబాటులో ఉండేలా మునిసిపల్ పాత భవనంలో ఆధునిక హంగులతో రూ.2.80 కోట్లతో నూతన గ్రంథాలయ భవనం ఏర్పాటు చేస్తున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని మునిసిపల్ పాత కార్యాలయం ప్రస్తుత సిటీ గ్రంథాలయం ఆవరణలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ కూలిన జిల్లా గ్రంథాలయం వద్ద స్థలం సరిపోకపోవటంతో పాటు పక్కనే మైదానం ఉండటంతో పాత మునిసిపల్ భవనంలో ప్రస్తుత సిటీ గ్రంథాలయ భవనాన్ని పూర్తిగా తీసివేసి ఆ స్థలంలోనే నూతన గ్రంథాలయ భవనాన్ని ఆధునిక హంగులతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ గ్రంథాలయం రైల్వేస్టేషన్, సిటీ బస్టాండ్‌కు దగ్గరగా ఉండటంతో గ్రామీణ విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అనువుగా ఉంటుందన్నారు. వెంటనే పనులు ప్రారంభించి త్వరలోనే అందుబాటులోకి వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఈ వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బందుల లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్, మునిసిపల్ కమిషనర్ తాగునీటి సమస్యలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నాగార్జున సాగర్ నుంచి నీటిని తీసుకురావాలన్నా కొంత సమస్యలతో కూడిన వ్యవహారమని, అయినా జిల్లాకు తాగునీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా నీటిని తీసుకోచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వాలు (ఆంధ్రా, తెలంగాణ)సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీటిని ఖాళీచేయడంతో నేడు ఈ దుస్థితి ఏర్పడిందన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం వస్తే రాష్ట్రంలోని మహిళలకు ఆరు గ్యారంటీలను తప్పక అమలుచేస్తామని సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మంత్రుల సహకారంతో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసినప్పటికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. అనంతరం ఖమ్మం నగరంలోని పాత డీఈవో కార్యాలయంలో రూ.కోటి 43లక్షలతో నిర్మించనున్న పట్టణ ప్రాథమిక, ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నీరజ, కలెక్టర్ వీపీ గౌతమ్, మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, గ్రంథాలయ పర్సన్ ఇన్‌చార్జ్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, కార్పొరేటర్లు కమర్తపు మురళీ, గ్రంథాలయ కార్యదర్శి మంజువాణి, తదితరులు పాల్గొన్నారు.

జోన్-2లోకి ఎన్నెస్పీ ఆయకట్టు

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మధిరటౌన్, మార్చి 13: రాష్ట్ర కేబినెట్‌లో మధిర ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కనే నెంబర్-2 అని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మధిరలో రూ.10కోట్లతో చేపట్టిన మధిర ట్యాంక్‌బండ్ విస్తరణ, నిధానపురం వరకు నాలుగు లైన్ల రోడ్డుకు, రూ.77లక్షలతో నిర్మించే మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీకి, ఆత్కూరు నుంచి మధిర వరకు రూ.1.22కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ భట్టి నాయకత్వంలో మధిర నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విజ్ఞప్తి మేరకు ఎర్రుపాలెం, మధిర ప్రాంతంలో ఎన్నెస్పీ జోన్-3లో ఉన్న ఆయకట్టును జోన్-2లోకి మారుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మధిర మునిసిపల్ చైర్మన్ మొండితోక లత, కౌన్సిలర్లు మల్లాది సవిత, ఇక్బాల్ పాల్గొన్నారు.

భట్టి హెలికాప్టర్ లో సాంకేతిక లోపం...

మధిర పర్యటనకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వచ్చిన హెలీకాప్టర్ సాంకేతిక లోపంతో బుధవారం ఖమ్మం జిల్లా మధిరలో నిలిచిపోయింది దీంతో భట్టి, ఉత్తమ్‌లు రోడ్డుమార్గం ద్వారా వైరా పర్యటనకు వెళ్లారు.

మిర్చి రైతుల చూపు... కోల్డ్ స్టోరేజీల వైపు..

- ధర తగ్గడంతో కోల్డ్ స్టోరేజీలకు క్యూ కడుతున్నరైతులు
- చోటు లేదని గేట్లకు తాళం వేస్తున్న యజమాన్యాలు
- కిరాయి ధరల్లో వ్యత్యాసంతో రైతుల దిగాలు

ఖమ్మం మార్కెట్, మార్చి 13; అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివిలా తయారైంది అన్నదాతల పరిస్థితి. ఆరుగాలం కష్టించి పండించిన మిర్చి పంటను కోల్డ్ స్టోరేజీల్లో దాచుకుందామంటే అక్కడా చోటు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మిర్చి ధరలు తగ్గుముఖం పడుతుండటంతో రైతులు తమ పంటను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు.

ఈ క్రమంలో మార్కెట్ పరిసరాల్లోని శీతలగిడ్డంగుల వద్ద హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తుండటంతో మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో మిర్చి రైతులు నగర శివారులో ఉన్న కోల్డ్‌స్టోరేజీలకు క్యూ కడుతున్నారు. కాగా నగరంలోని కోల్డ్ స్టోరేజీలకు, నగర శివారులోని కోల్డ్‌స్టోరేజీలలో బస్తా ఒక్కంటికి కిరాయి ధరల వ్యత్యాసంతో పాటు, వ్యాపారుల పంటకే కోల్డ్ స్టోరేజీల యజమాన్యాలు తొలి ప్రాధాన్యం ఇస్తుండటంతో తమ పంటలను దాచుకోవడానికి కూడా చోటివ్వరా అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గేట్లకు తాళం

మార్కెట్‌లో మిర్చీ ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు తమ మిర్చి పంటను కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. జిల్లాలోని మిర్చి పండించే గ్రామాలనుంచి రైతులు తమ పంటను ట్రాక్టర్లు, తదితర వాహనాలతో వ్యవసాయ మార్కెట్ సమీప కోల్డ్ స్టోరేజీల వద్దకు రావడంతో కోల్డ్ స్టోరేజీల యజమాన్యాలు గేట్లకు తాళం వేయడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి నగరం, శివారు ప్రాంతాల్లో సుమారు 23 కోల్డ్ స్టోరేజీలు ఉండగా ఆయా గిడ్డంగులలో 24 లక్షల బస్తాల నిల్వ సామర్థ్యం కాగా ఇప్పటికి కేవలం 15లక్షల బస్తాలు మాత్రమే వచ్చాయి. అయినా.. హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్టోరేజీ యజమాన్యాలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి పంపిన రిపోర్టులో తమ గిడ్డంగులలో నిల్వ లెక్కకు, వారి వద్ద ఉన్న వాస్తవిక లెక్కకు పొంతన లేకపోవడంతోపాటు ఖాళీగా ఉన్నా.. కోల్డ్‌స్టోరేజీ నిండిందని గేట్లకు బోర్డులు పెట్టడంతో స్టోరేజీలను తనిఖీ చేసేందుకు మార్కెట్ అధికారులు సిద్ధమైనట్టు తెలిసింది.

వ్యాపారుల పంటకే ప్రాధాన్యం

కోల్డ్ స్టోరేజీల్లో రైతుల పంటను కాకుండా వ్యాపారుల పంటకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కోల్డ్‌స్టోరేజీ ఖాళీగా ఉన్నా.. బస్తాలను ఎందుకు దిగుమతి చేసుకోవట్లేదని రైతులు కోల్డ్ స్టోరేజీ యజమాన్యాలను ప్రశ్నిస్తున్నారు. కోల్డ్‌స్టోరేజీ యజమాన్యాలు సైతం మిర్చి వ్యాపారం చేస్తుండటంతో వారు ఈనెల, వచ్చే నెలలో కొనుగోలు చేసే పంట నిల్వ చేసేందుకు ముందుగానే కొన్ని చాంబర్‌లు కావాలనే ఖాళీగా ఉంచారని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు.

ధరల్లో వ్యత్యాసం

మార్కెట్ చుట్టు పక్కల కోల్డ్‌స్టోరేజీలకు, నగర శివారులో ఉన్న కోల్డ్ స్టోరేజీలకు బస్తా కిరాయిలలో వ్యత్యాసంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని గిడ్డంగుల్లో బస్తా ఒక్కంటికి రూ.212లు వసూలు చేస్తుండగా నగర శివారులో ఉన్న గిడ్డంగులలో బస్తాకు రూ.170లు నుంచి రూ. 182ల వరకు వసూలు చేస్తున్నారు. అన్ని చోట్లా ఒకే రకమైన కిరాయి ధరలు ఉండాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

సత్తుపల్లిరూరల్, మార్చి13: బంధుమిత్రులు కొందరు చిన్నచూపు చూస్తున్నారని బుధవారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. మండలంలోని రామానగరానికి చెందిన జల్లి వెంకటేశ్వరరావు, సత్యావతిలు 14ఏళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఇటీవల బంధువులతో జరిగిన వాగ్వాదంతో సత్యావతి మనస్తాపానికి గురై పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్, మార్చి13: మండలంలోని రేజర్ల గ్రామానికి చెందిన మల్లెల్లి విశ్వనాథం (63) ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి వెళ్తుండగా సింగరేణి బైపాస్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

యువకులకు గాయాలు...

చంద్రుగొండ: రోడ్డు దాటుతున్న బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో తిప్పనపల్లి గ్రామానికి చెందిన గాదె ఉపేందర్, రామిశెట్టి బాలప్రసాద్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనారోగ్యంతో గ్రామీణ వైద్యుడు ..

ఏన్కూరు, మార్చి13: తిమ్మరావుపేటకు చెందిన గ్రామీణ ఆయుర్వేద వైద్యుడు కడియం సంగయ్య (95)మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. 20 గ్రామాలకు ఉచితంగా ఆయుర్వేద వైద్య సేవలను అనేక ఏళ్లుగా అందించి ప్రజల మన్ననలు పొందారు. మృతదేహాన్ని మండల గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు నాగేశ్వరరావు, అమీర్, జానితో పాటు పలువురు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మణుగూరు, మార్చి 13: గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను బుధవారం మణుగూరులో పోలీసులు పట్టుకున్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్ కుమార్ తెలిపారు.

ఉచ్చుకు దుప్పి బలి..

సత్తుపల్లిరూరల్, మార్చి13: చౌడవరంలోని ఓ మిర్చి తోటకు పందుల నుంచి రక్షణ కోసం రైతు ఉచ్చుపెట్టగా, దుప్పి హతమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. చౌడవరం గ్రామ శివారుల్లో ఓ మిర్చి తోటను కౌలుకు తీసుకున్న ఓ రైతు తన పంటను నాశనం చేస్తున్న అడవి పందుల రక్షణ కోసం ఉచ్చును ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో ఆ ఉచ్చుకు దుప్పి ఒకటి బలైంది. దుప్పి మాసం విక్రయిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

యువకుడి బలవన్మరణం

ఖమ్మం క్రైం, మార్చి 13: మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి ఖమ్మం పట్టణంలో జరిగింది. నగరంలోని రేవతి సెంటర్ ప్రాంతానికి చెందిన దేవత్ హరి(19) పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో కూలి పనులు చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ యువతితో ప్రేమలో ఉన్నాడని, అతడిని సదరు యువతి బంధువులు అనుమానిస్తూ అతనిపై పలుమార్లు దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హరి మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసు స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు. సీఐ బాలకృష్ణ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు.

మద్యం షాపులకు మరో షాక్

- వ్యాట్‌పై తాత్కాలిక పరిష్కారం జరిగిన వెంటనే రంగంలోకి ఆహార తనిఖీ శాఖ
- ఆహార లైసెన్స్‌లు తీసుకోవాలని ఉత్తర్వులు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 13: రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మద్యం వ్యాపారులపై దెబ్బ మీద దెబ్బ పడుతోంది. ఒక వైపు మద్యం ప్రియులు కోరిన డిమాండ్ ఉన్న మద్యాన్ని ఎక్సైజ్ శాఖ పంపిణీ చేయలేక పోతుంది. రేషన్ విధానంలో అరకొరగా మద్యాన్ని పంపిణీ చేస్తున్నారు. మరో వైపు గత వారం రోజులుగా కమర్షియల్ ట్యాక్స్ అధికారులు మద్యం దుకాణాలకు వ్యాట్ రిజిస్ట్రేషన్ చేయించుకొవాలని ఒత్తిడి తీసుకరావటంతో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం రవాణాను మూడు రోజులు బంద్ చేయటంతో తత్కాలికంగా ఊరట కల్పించారు. మరుసటి రోజే ఉమ్మడి జిల్లా ఆహార నాణ్యతా ప్రమాణాల శాఖ అధికారి కిరణ్‌కుమార్ ఎక్సైజ్‌శాఖ అధికారులను కలిసి మద్యం దుకాణాలకు ఫుడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని చర్చలు జరపటంతో మద్యం వ్యాపారులకు మూడో దెబ్బ పడిందని వాపోతున్నారు.

పడిపోయిన మద్యం అమ్మకాలు

మద్యం వైన్స్ వ్యాపారాన్ని వ్యాట్ పరిధిలోకి తీసుకరావటాన్ని నిరసిస్తూ ఉమ్మడి జిల్లాలోని వైన్స్, బార్ ఎండ్ రెస్టారెంట్ల యజమానులు శని, సోమ, మంగళ వారాలు బంద్ పాటించారు. వైరా ఐఎంఎఫ్ఎల్ డిపో నుంచి వైన్స్‌కు మద్యం రవాణా కాకుండా ఈ-చలాన్లు తీయకుండా నిలుపుదల చేశారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.18కోట్లు మద్యం అమ్మకాల రవాణా నిలిచిపోయింది. సమస్య తీవ్రంగా మారటంతో ఉమ్మడి జిల్లా వ్యాపారులకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా మద్యం వ్యాపారులు సంఘీభావం చెప్పటంతో రాష్ట్ర స్థాయిలో ఎక్సైజ్‌శాఖ, సేల్స్ ట్యాక్స్ అధికారులు కలిసి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి సయన్వయంతో తత్కాలికంగా సమస్యను పరిష్కారం చూపారు. ఐఎంఎఫ్ఎల్ డిపో నుంచి మద్యం రవాణా జరుగుతున్న వాహనాలకు ట్రాన్స్ పర్మిట్ లేఖను ఏర్పాటు చేశారు. అందులో ఆరో కాలం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి రవాణా జరుగుతున్న మద్యానికి ముందుగానే వ్యాట్ చెల్లింపులు జరిగాయని పర్మిట్ లేఖలో పేర్కొంటున్నారు. అయితే ఈ నిబంధన ఈనెల 15వరకే అని చర్చ జరగటంతో తత్కాలికంగా సమస్య పరిష్కారం జరిగినట్లు తెలుస్తోంది.

ఫుడ్ లైసెన్స్‌లు కొరుతూ..

1994నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రం నుంచి ఎక్సైజ్‌శాఖ ద్వారా ప్రభుత్వ ఆదీనంలో మద్యం అమ్మకాలు జరుపుతున్నాయి. ఇప్పటి వరకు వైన్స్ వ్యాపారులు ఫుడ్ లైసెన్స్‌లు పొందలేదు. వైన్స్‌కు అనుబంధంగా ఉండి మాంసాహార, పల్లీ, బటానీలు, ఇతర పదార్థాలు అమ్మకాలు జరిపే వారు మాత్రం స్ట్రీట్ ఫుడ్ వ్యాపార లైసెన్స్‌లు, పురపాలకం, గ్రామ పంచాయతీ లైసెన్స్‌లు తీసుకొని వ్యాపారం కొనసాగిస్తున్నారు. బుధవారం ఉమ్మడి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్ ఖమ్మంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డితో సమావేశమైనారు. ఉమ్మడి జిల్లాలోని 261 మద్యం వ్యాపారం చేసే వైన్స్ దుకాణాలు ఫుడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని ఉత్తర్వులు అందజేశారు. దీంతో వైన్స్ అసోసియేషన్ నాయకులు ఎక్సైజ్ అధికారుల కార్యాలయానికి పరుగులు పెట్టారు. తాము మద్యాన్ని మాత్రమే అమ్మకాలు చేస్తున్నామని ఎటువంటి తినే ఆహార పదార్థాలు వైన్స్‌లో అమ్మకాలు జరగవని మమ్మల్ని ఫుడ్ లైసెన్స్ పరిదిలోకి తీసుకరావోద్దని వినతిపత్రం అందించారు. దీంతో స్పందించిన ఈఎస్ నాగేంద్రరెడ్డి సమస్యను రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

వీరబాబుకు కలాం సాహితీ అవార్డు

నేలకొండపల్లి, మార్చి13: అనాసాగరం గ్రామానికి చెందిన కవి చిలకబత్తిన వీరబాబు అబ్దుల్ కలాం సాహితీ అవార్డును అందుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని ఈనెల 10న హైదరాబాద్‌లోని రామానుజరావు కళామందిర్‌లో జరిగిన కార్యక్రమంలో వీరబాబుకు ఈఅవార్డును ప్రదానం చేశారు.

జాతర ఆదాయం రూ.5.74లక్షలు

కల్లూరు, మార్చి 13: కల్లూరులోని శ్రీకాశ్మీర మహాదేవక్షేత్రం(అప్పయ్యస్వామి) శివాలయంలో శివరాత్రి జాతర సందర్భంగా ఆదాయం రూ.5,74,628 సమకూరిందని ఆలయ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం హుండీ లెక్కింపును నిర్వహించారు.

అభివృద్ధి పనులపై 'విజిలెన్స్'

ఖమ్మంకార్పొరేషన్, మార్చి13: నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన రహదారులపై ఫిర్యాదులు రావడంతో వరంగల్ విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఫైళ్లను, రహదారులను పరిశీలించి కొలతలను తీసుకున్నారు. రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించిన గోళ్లపాడు చానెల్, నూతనబస్టాండ్, సమీకృత వెజ్-నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాలపై జరిగిందని విజిలెన్స్‌కు ఫిర్యాదులందాయి. ఇప్పటికే 14 రహదారుల్లో నాణ్యత లేదని గుర్తించారు. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి స్వయంగా తనిఖీల్లో పాల్గొనడంతో చర్చాంశనీయమైంది. విజిలెన్స్ ఏఎస్పీ బాలకోటి, డీఈ రాంమోహన్‌రెడ్డి, ఏఈ దివ్య తనిఖీల్లో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ అదృశ్యం

మణుగూరుటౌన్, మార్చి13: అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని తోగు గ్రామంలో జరిగింది. ఖమ్మంతోగు ప్రాంతానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ వట్టం సుశీల నెల రోజుల నుంచి కనిపించడం లేదు. ఆమె భర్త వట్టం భిక్షం నెల రోజుల నుంచి బంధువులు, తెలిసిన వాళ్ల ఇళ్లల్లో వెతికినా అచూకీ లభించలేదని తెలిపారు. దీంతో ఆమె భర్త బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

15 ఏళ్ల పోరాటం ఫలించింది...

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 13: కులాల వారీగా ప్రభుత్వం గుర్తించి ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కుల వృత్తులను గుర్తించాలని 15ఏళ్లుగా ఎన్నో పోరాటాలు చేశామని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుర్తించటం హర్షనీయమని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళీ పేర్కొన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా కమర్తపు మురళీ మాట్లాడుతూ 16 కులాలకు సంబంధించిన కార్పొరేషన్లు ఏర్పాటు చేయటం కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద, చిరు వ్యాపారులు, చేతి వృత్తిదారులపై ఉన్న అంకిత భావాన్ని తెలుపుతోందని కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నర్సింహస్వామి, జనార్ధన్, బండారు శ్రీనివాసరావు, కొండల్‌రావు, సత్యనారాయణ, పులిపాటి ప్రసాద్, రాజేందర్, భాస్కర్, గురుమూర్తి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో...

బీసీ కులాల్లో భాగంగా మున్నూరు కాపులను గుర్తించి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయటంపై మున్నూరు కాపు సంఘం నాయకులు హర్షం ప్రకటించారు. కార్పొరేటర్ రాపర్తిశరత్ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సంఘం నాయకులు నరేశ్, మాదూరి సైదారావు, గడ్డం శ్రీను, గంగిశేట్టి శ్రీనివాసరావు, రమణ పాల్గొన్నారు.

సీఎం పర్యటన నిరాశపరిచింది..

భద్రాచలం, మార్చి 13: భద్రాచలానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తుండటంతో పట్టణాభివృద్ధి సమస్యలపై నిర్దిష్ట ప్రకటన చేస్తారని కోటి ఆశలతో ఎదురుచూసిన ప్రజలకు నిరాశే మిగిలిందని అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘా ల నాయకులు పేర్కొన్నారు. భద్రాచలంలో బుధవారం జరిగిన అఖిలపక్ష పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ప్రధాన సమస్యలు కరకట్ట, ఐదు గ్రామ పంచాయతీలు, శ్రీరాముడి ఆలయాభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీ గా ఉన్న డాక్టరు పోస్టులను భర్తీ చేయడం తదితర ప్రధాన అంశాలపై నిర్దిష్టంగా ముఖ్యమంత్రి మాట్లాడకపోవ డం పట్ల ప్రజల్లో నిరాశ మిగిలిందని అన్నారు. సమావేశంలో రావులపల్లి రవి కుమార్, అరికెల తిరుపతిరావు, కొడాలి శ్రీనివాసరావు, కెచ్చెల కల్పన, దాసరి శేఖర్, ఎంబి నర్సారెడ్డి, శివాజీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు చర్యలు

- సింగరేణి డైరెక్టర్ (పా) శ్రీనివాస్

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 13 : సింగరేణి సంస్థలో ఈ ఆర్థిక సంవత్సరంలో నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్‌వీకే. శ్రీనివాస్ తెలిపారు. రానున్న ఐదేళ్లలో సింగరేణిలో 90మిలియన్ టన్నుల బొగ్గు ఉత్ప త్తి సాధించాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. బుధవారం ఇల్లెందు గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు సింగరేణి సంస్థ మరిన్ని ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నా రు. ఇప్పటికే కారుణ్య నియామకాల ద్వారా సింగరేణి వారసులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. ఇంటర్నల్ పోస్టుల భర్తీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. బొగ్గు ఉత్పత్తి రంగం నుంచి సింగరేణి సోలార్ విద్యుత్ ఉత్ప త్తి వైపు అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో 550 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను తయారు చేసే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 70 మిలియన్ టన్నులు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని, ఇప్పటికే 65.41మిలియన్ టన్ను లు ఉత్పత్తి చేశామని తెలిపారు. తెలంగాణతో పాటు ఒరిస్సాలోని నైనీ ప్రాజెక్టుల బొగ్గు ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ స మావేశంలో జనరల్ మేనేజర్లు హనుమంతరావు, బసవయ్య, ఎజీఎం శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ మేనేజరు సుశీల్‌కుమార్, జీకే. కిరణ్‌కుమార్, ముకుంద సత్యనారాయణ, కమ్యూనికేషన్ అధికారి శ్రీనివాస్, కమ్యూనికేషన్ కో ఆర్డినేటరు శ్రీనాథ రాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్



బదిలీ అయిన అధికారులకు సన్మాన దృశ్యం

ఎక్సైజ్ అధికారులకు వీడ్కోలు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 13: ఖమ్మం వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వరంగల్ వెళ్లిన రాజు ఇతర అధికారులు రబ్బానీ, లతకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి జిల్లా శాఖ మైలురాళ్లను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఎక్సైజ్ సీఐలు కృష్ణ, కరుణశ్రీ, రమేశ్, ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

వినోద్ కబ్జాలపై కేసీఆర్ మాట్లాడరేం?

» బీఆర్ఎస్ పాలనలో భూ కబ్జాలు, అరాచకాలు

» ఆరు గ్యారెంటీలపై మోసం చేసిన కాంగ్రెస్‌కు..

బీఆర్ఎస్ గతే పడుతుంది: బండి సంజయ్



కరీంనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ ఎంపీ వినోద్ కుమార్ స్వాహా చేసిన రూ.500 కోట్ల విలువైన భూదాన్ భూములపై కేసీఆర్ ఎందుకు నోరు మెదపడం లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో కరీంనగర్‌లో బీఆర్ఎస్ నేతలు చేసిన అరాచకాలు, భూ కబ్జాల బాగోతం ఇటీవల వెలుగులోకి రావడం.. ఫలితంగా ఆరుగురు కార్పొరేటర్లు జైలుకు వెళ్లడం నిజం కాదా..? అని ప్రశ్నించారు. బుధవారం కరీంనగర్‌లో సంజయ్ మీడియాతో మాట్లాడారు. కేసీఆరే పెద్ద అవినీతి పరుడని.. కేంద్ర మంత్రిగా ఈఎస్ఐ, సహారా కుంభకోణాల్లో ఉన్నారని సంజయ్ ఆరోపించారు. కేసీఆర్ అవినీతి నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు తెలియడంతో రాజీనామా చేయాలని కోరింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. అప్పుడు రాజీనామా చేసిన కేసీఆర్.. తెలంగాణ కోసమే చేశానని డ్రామాలు ఆడారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రమాదకరమని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) నివేదిక ఇచ్చినా.. అందుకు బాధ్యుడైన కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఆరు గ్యారెంటీలకు ఆమోదం తెలపకపోవడం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారెంటీలపై మోసం చేసిన కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ గతే పడుతుందని విమర్శించారు.

బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నా: కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, మార్చి 13: ఇటీవల జరిగిన బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు వ్యవహారంతోనే తాను పార్టీని వీడుతున్నట్టు బీఆర్ఎస్ ఆసిఫాబాద్ జిల్లా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలిపారు. బుధవారం ఆయన కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన ప్రత్యర్థి బీఎస్పీ అధినేత ఆర్ఎస్ ప్రవీణ్ ఉండగా, ఎంపీ ఎన్నికల కోసం నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు పెట్టుకోవడాన్ని తాను జీర్ణించుకోలేక పోతున్నానని అన్నారు. సిర్పూరు నియోజకవర్గ కార్యకర్తలు, అభిమానుల అభీష్టం మేరకు తాను పార్టీ మారేందుకు నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. బీఆర్ఎస్ అభివృద్ధికి ఎనలేని కృషి చేసినా పొత్తు వ్యవహారంతోనే పార్టీని వీడాల్సి వస్తోందని చెప్పారు. గురువారం కాగజ్‌నగర్‌లో జరిగే కార్యక్రమంలో కాంగ్రెస్‌లో చేరుతానని తెలిపారు. 2023 ఎన్నికల్లో సిర్పూరు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ తరుపున కోనప్ప, బీజేపీ నుంచి డాక్టర్ హరీష్‌బాబు, బీఎస్పీ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నుంచి రావి శ్రీనివాస్ పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో కోనప్ప మూడువేల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి డాక్టర్ హరీష్‌బాబు చేతిలో ఓడిపోయారు. కోనప్ప 2004లో కాంగ్రెస్, 2014లో బీఎస్పీ, 2018 బీఆర్ఎస్ తరుపున గెలుపొందారు.

రెండో సీటూ ఇవ్వండి..!

» బీఆర్ఎస్‌కు బీఎస్పీ ప్రతిపాదన

» నాగర్‌కర్నూల్‌కు ఓకే.. ఆదిలాబాద్‌పై ఆలోచిద్దామన్న కేసీఆర్!

» ఇరుపార్టీలు మరోసారి భేటీ అయ్యే చాన్స్

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌తో పొత్తులో భాగంగా రెండు స్థానాల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని బీఎస్పీ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో పొత్తు, ఆయా స్థానాలపై ఏకాభిప్రాయం కుదుర్చుకునేందుకు బుధవారం నందినగర్‌లోని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసంలో ఆయనతో బీఎస్పీ కేంద్ర సమన్వయకర్త, ఎంపీ రాంజీగౌతమ్‌తోపాటు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమయావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానంపై ఇరు పార్టీల నేతలు చర్చలు జరిపారు. పొత్తులో భాగంగా.. బీఆర్ఎస్‌ను నాగర్‌కర్నూల్‌తోపాటు ఆదిలాబాద్ సీట్లను బీఎస్పీ కోరినట్లు సమాచారం. అయితే నాగర్‌కర్నూల్ స్థానం ఇచ్చేందుకు సుముఖత చూపిన కేసీఆర్.. ఆదిలాబాద్ గురించి ఆలోచించి నిర్ణయం తీసుకుందామని చెప్పినట్లు తెలిసింది. బీఎస్పీకి కేటాయించే స్థానాలపై పూర్తి స్పష్టతరాని కారణంగా.. ఇరు పార్టీలు మరోసారి భేటీ కానున్నాయని సమాచారం. ఒకట్రెండు రోజుల్లో అన్ని విషయాలపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశముందని తెలుస్తోంది.

కుటుంబం ఉసురుతీసిన 9 మందిపై కేసు

» నిందితుల్లో ఐదుగురు విలేకర్లు, హోంగార్డు

» ముగ్గురి అరెస్టు.. మిగతావారి కోసం గాలింపు

» వేధింపులు భరించలేక ఈ నెల 3న

ముగ్గురు పిల్లల్ని చంపి ఆత్మహత్య చేసుకున్న తండ్రి

నార్సింగ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌మెయిలింగ్, బెదిరింపులకు తాళలేక ఓ వ్యక్తి చిన్నపిల్లలైన ముగ్గురు కొడుకుల్ని చంపి, తాను ఆత్మహత్య చేసుకున్న కేసులో మొకిలా పోలీసులు ఐదుగురు విలేకరులు, హోంగార్డు సహా 9 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ నెల 3న శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామంలో నీరటి రవి అనే వ్యక్తి తన ముగ్గురు పిల్లలను హత్య చేసి, తాను ఆత్మహత్య చేసుకున్నాడు. రవి జీఎస్ఎన్ కంపెనీలో మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లో కొంతమంది చేత డబ్బులు పెట్టించాడు. అయితే ఆ కంపెనీ నుంచి డబ్బులు తిరిగి రాలేదు. ఈ విషయం తెలిసి ఈ ఐదుగురు విలేకర్లు రవిని బెదిరించారు. తమకు డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. రవి తన వద్ద డబ్బులు పెట్టిన నాగరాజు అనే హోంగార్డు, అతని భార్య మనీలాకు రెండు ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇచ్చినప్పటికీ వారు కూడా తీవ్రంగా ఒత్తిడి చేశారు. తిరుపతిరావు, రామకృష్ణ అనే వ్యక్తులు, నాగరాజు, మనీలాతో పాటు విలేకర్లు కురమ శ్రీనివాస్ (ఈనాడు), మంగళి శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి), వడ్డె మహేశ్ (నమస్తే తెలంగాణ), సిరిపురం శ్రీనివాస్‌రెడ్డి (వార్త), సనికె ప్రవీణ్ కుమార్ (సాక్షి)పై కేసు నమోదు చేశామని డీసీపీ తెలిపారు. విషయం తెలిసి ఆంధ్రజ్యోతి యాజమాన్యం వారం రోజుల క్రితమే మంగళి శ్రీనివాస్‌ను తొలగించింది. ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజును అరెస్టు చేసిన పోలీసులు... మిగతా వారి కోసం గాలిస్తున్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 13: ఉపాధ్యాయ నియామకాల కోసం డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ బుధవారం తెలిపారు. అర్హులైన ఉమ్మడి ఖమ్మం జిల్లా అభ్యర్థులకు ఉచితంగా వసతి, భోజనం, స్టడీ మెటీరియల్‌తో కూడిన ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. రెండు నెలల కాలం కొనసాగే శిక్షణ కోసం ఈనెల 26వ తేదీ లోపు టీఎస్ స్టడీసర్కిల్ వైబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. 100 మందిని ఎంపిక ఎంపిక చేసి ఏప్రిల్ 4 నుంచి జూన్ 2 వరకు శిక్షణ ఇస్తామన్నారు. కాగా దరఖాస్తు చేసే వారు విధిగా టెట్ ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నేడు ఆఖరు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 13: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకొనేందుకు నేటితో (గురువారం) గడువు మీరుతుందని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోలేని వారు దగ్గరలోని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫుట్‌బాల్ ఔత్సాహికులకు మౌఖిక పరీక్ష

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 13: రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే ఎంపికలకు అండర్- 20 విభాగంలో పాల్గొనేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఔత్సాహిక క్రీడాకారులకు మౌఖిక పరీక్షకు హాజరు కావాలని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కళ్యాణపు ఆదర్శ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తుది ఎంపికల్లో సత్తా చాటిన క్రీడాకారులు ఏప్రిల్ మొదటి వారంలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున పాల్గొంటారని తెలిపారు. మౌఖిక పరీక్షలో పాల్గొనదలచిన క్రీడాకారులు 01-01-2005 నుంచి 31-12-2007 మధ్య జన్మించి ఉండాలన్నారు. వివరాల కోసం 99896 47696 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా మర్రి?



నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేతో కొనసాగుతున్న సంప్రదింపులు

ఒకట్రెండు రోజుల్లో ప్రకటన!

నాగర్‌కర్నూల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి త్వరలోనే హస్తం గూటికి చేరనున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బుధవారం నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఈ వాదనకు మరింత బలం చేకూరింది. శాసనసభ ఎన్నికలు ముగిసినప్పటి నుంచి మర్రి జనార్దన్‌రెడ్డి పార్టీ మార్పుపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఆయనకు ఆహ్వానాలు అందాయి. జహీరాబాద్ నుంచి బీజేపీ తరఫున లోక్‌సభకు పోటీ చేయాల్సిందిగా ఆ పార్టీ నేతలు సంప్రదింపులు జరిపారు. అదేసమయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన మర్రి జనార్దన్‌రెడ్డి.. బీజేపీ నాయకులు తనను సంప్రదించిన మాట వాస్తవమేనన్నారు. కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో చర్చించకుండా తాను నిర్ణయం తీసుకోబోనని చెప్పారు. అయితే, మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా జనార్దన్‌రెడ్డిని ప్రకటించనున్నట్లు బలంగా ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి మల్కాజిగిరి లేదా మహబూబ్‌నగర్ స్థానాల్లో పోటీ చేయాలని ఆఫర్ ఉన్నా.. జనార్దన్‌రెడ్డి ఆసక్తి చూపడం లేదని సమాచారం. ఈ క్రమంలో ఆయన్ను మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడం లాంఛనమేనని తెలుస్తోంది. కాగా, పార్టీ మారే అంశంపై జనార్దన్‌రెడ్డి మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. కాంగ్రెస్, బీజేపీలు తనను సంప్రదిస్తున్నా.. తాను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నారు. ఒకటి రెండు రోజుల్లోనే ఈ విషయంపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

అధిష్ఠానం మాటే.. మా మాట!

» అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ నేతలు

లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా ఎంపిక చేస్తే వారిని గెలిపించుకుంటామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని 13 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షులతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ గాంధీభవన్‌లో బుధవారం భేటీ అయ్యారు. టికెట్ల కేటాయింపుపై అభిప్రాయాలు సేకరించారు. ఇందులో భాగంగా మెజారిటీ నేతలు అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కొద్ది మంది మాత్రం ఫలానా అభ్యర్థి అయితే సామాజికంగా, ఆర్థికంగా సరైన పోటీదారు అని అభిప్రాయాలు చెప్పారు. ఇదిలాఉంటే, ఆయా నియోజకవర్గాలకు చెందిన ఆశావహులు.. తమ పేరును ప్రతిపాదించాలని పార్టీ నేతలను ఫోన్లు, మెసేజ్‌ల ద్వారా విజ్ఞప్తి చేయడం కొసమెరుపు.

అధినేత వద్దకు ఆరూరి

వరంగల్ టు హైదరాబాద్.. హైడ్రామా.. బీజేపీలో చేరొద్దంటూ బుజ్జగించేందుకు వెళ్లిన ఎర్రబెల్లి, సారయ్య, బీఆర్ఎస్ నేతలు



ఆరూరిని బీఆర్ఎస్ నేతలు తీసుకెళుతుండగా అడ్డుకుంటున్న అనుచరులు

హైదరాబాద్/వరంగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో చేరేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ ఇంటి వద్ద హైడ్రామా చోటు చేసుకుంది. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించేందుకు బుధవారం ఉదయం ఆయన ఏర్పాట్లు చేసుకోగా.. బీఆర్ఎస్ నేతలు ఆయన్ను పార్టీ అధినేత కేసీఆర్ వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రమేశ్ అనుచరులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగి, ఉద్రిక్తతకు దారి తీసింది. పార్టీలో తనకు అన్యాయం జరిగిందని, ఈ సమయంలో తన నిర్ణయాన్ని మార్చుకోలేనని రమేశ్ చెప్పినా బీఆర్ఎస్ నేతలు వినిపించుకోకపోవడం, మార్గం మధ్యలో బీజేపీ నాయకులు వారి వాహనాలను అడ్డుకొని ఆందోళన చేపట్టడం.. కలకలం రేపింది. ఆరూరి కిడ్నాప్ అంటూ సోషల్‌మీడియాలో ఈ విషయం వైరల్ కావడంతో వరంగల్ నుంచి బయలుదేరిన వీరి వాహనాలు హైదరాబాద్ చేరుకునే దాకా ఉత్కంఠ కొనసాగింది. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేశ్ బుధవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, సాయంత్రం ఢిల్లీకి వెళ్లి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సమక్షంలో పార్టీలో చేరాలని భావించారు. అనుకున్నట్లుగానే వరంగల్‌లోని తన నివాసం వద్ద ముఖ్య అనుచరులతో సమావేశమైన ఆరూరి.. పార్టీలో తనకు గుర్తింపు దక్కడం లేదని, మళ్లీ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసినా తనను ఓడిస్తారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఉదయం 11గంటల సమయంలో మీడియాతో మాట్లాడేందుకు ఆయన ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా.. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీఆర్ఎస్ నేతలు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, సుందర్‌రాజ్ అక్కడికి చేరుకున్నారు. 'ఒక్క నిమిషం మాట్లాడుదాం' అంటూ ఇంట్లోకి తీసుకెళ్లారు. బీజేపీలోకి వెళ్తే భవిష్యత్తు ఉండదని, పార్టీ మారొద్దని బుజ్జగించేందుకు ప్రయత్నించారు. అంతలోనే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకుని, రమేశ్ భుజంపై చేయి వేసి కేసీఆర్ వద్దకు వెళ్దామంటూ బయటకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఆరూరి మద్దతుదారులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. ఆరూరి అనుచరులు కారుకు అడ్డుగా నిలబడి నినాదాలు చేశారు. చివరకు ఉద్రిక్తత మధ్య రమేశ్‌ను తీసుకుని హైదరాబాద్‌కు బయల్దేరగా.. మార్గమధ్యలోని జనగామ జిల్లా పెంబర్తి వద్ద బీజేపీ నాయకులు వారి వాహనాన్ని అడ్డుకొని ఆందోళనకు దిగారు. బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో 50మంది కార్యకర్తలు ఆరూరి రమేశ్‌ను బలవంతంగా కారులో నుంచి కిందకు దించారు. ఈ పెనుగులాటలో ఆరూరి రమేశ్ చొక్కా చినిగిపోయింది. బీఆర్ఎస్ నాయకులు బుజ్జగించాలని ప్రయత్నిస్తే మీరెలా వెళ్తారంటూ వారు నిలదీశారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి దశమంతరెడ్డి ఫోన్ చేసి చెప్పారు. అక్కడే ఉన్న రమేశ్‌తో కిషన్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. తాను వ్యక్తిగత పనుల నిమిత్తమే ఎర్రబెల్లితో కలిసి హైదరాబాద్ వెళ్తున్నానని, ఇచ్చిన మాట ప్రకారం బీజేపీలో చేరేందుకు సిద్ధంగానే ఉన్నానని రమేశ్ చెప్పారు. కిషన్‌రెడ్డి సూచన మేరకు బీజేపీ నేతలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఉద్రిక్తత మధ్య రమేశ్‌తోపాటు బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు.

బీఆర్ఎస్ నుంచి పోటీకి ఆరూరి నో?

వరంగల్ పార్లమెంట్ స్థానానికి సంబంధించిన అభ్యర్థిత్వంపై చర్చించేందుకు పార్టీ నాయకులతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమావేశమ్యారు. ఈ సందర్భంగా ఆరూరి రమేశ్ పేరును ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వయంగా ప్రతిపాదించగా.. మిగతా నేతలు మొగ్గు చూపారు. కానీ, ఎంపీ అభ్యర్థిగా తాను పోటీ చేసేది లేదని ఆరూరి స్పష్టం చేసినట్టు సమాచారం. ఇంత జరిగిన తర్వాత ఎంపీగా పోటీ చేయనని, అదే సమయంలో పార్టీ కూడా మారనని, పార్టీ ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా కలిసి పని చేస్తానని ఆరూరి అధినేతకు చెప్పినట్టు తెలిసింది. దీంతో కేటీఆర్ కలుగజేసుకుని రమేశ్‌ను ఒప్పించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. "అధికారంలో లేమని.. హైరానా పడకండి.. తెలంగాణలో బీఆర్ఎస్‌దే భవిష్యత్తు అనే విషయాన్ని తెలుసుకోండి. అనవసర నిర్ణయాలతో రాజకీయ భవిష్యత్తు పాడు చేసుకోవద్దు" అని రమేశ్‌ను ఉద్దేశించి కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. చివరకు అనూహ్యంగా వరంగల్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్యను కేసీఆర్ ప్రకటించారు.

నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు: ఆరూరి

"నన్నెవరూ అడ్డుకోలేదు.. బీఆర్ఎస్ నేతలు కిడ్నాప్ చేయలేదు.. వరంగల్ నేతలతో అధినేత కేసీఆర్ నిర్వహిస్తున్న సమావేశంలో పాల్గొనేందుకే హైదరాబాద్ వచ్చా" అని ఆరూరి రమేశ్ పేర్కొన్నారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని స్పష్టం చేశారు. తమ పార్టీ నేతలే నన్ను తీసుకుని వచ్చారని వెల్లడించారు. అమిత్‌షా సహా బీజేపీ నేతలెవరినీ తాను కలవలేదని పేర్కొన్నారు.



కాసాని జ్ఞానేశ్వర్



కడియం కావ్య



బాజిరెడ్డి గోవర్ధన్



గాలి అనిల్‌కుమార్

చేవెళ్ల నుంచి కాసాని, వరంగల్ నుంచి కావ్య

» నిజామాబాద్‌లో బాజిరెడ్డి, జహీరాబాద్‌లో అనిల్

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాలుగు పార్లమెంట్ స్థానాల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను పార్టీ అధినేత కేసీఆర్ బుధవారం ప్రకటించారు. పార్టీ ముఖ్య నేతలతో చర్చల అనంతరం వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి కడియం కావ్య పోటీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అదే విధంగా చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్, జహీరాబాద్ నుంచి గాలి అనిల్‌కుమార్, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ పేర్లను ప్రకటించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో 50శాతానికి పైగా బీసీలే ఉండడం, గతంలో ఆర్మూర్, బాన్సువాడ ఎమ్మెల్యేగా పని చేసి ఉండడం, జిల్లాలో అందరికీ తెలిసిన వ్యక్తిగా పేరుండడంతో బాజిరెడ్డి గోవర్ధన్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. మరోవైపు, జహీరాబాద్ సిటింగ్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరడంతో ఆ స్థానానికి పఠాన్‌చెరువుకు చెందిన సీనియర్ నేత అనిల్ కుమార్‌ను ఎంపిక చేశారు. పార్టీలో చాలా కాలంగా పని చేస్తుండడం, బీసీ అభ్యర్థి కావడం కలిసొస్తుందన్న అంచనాతో ఆయన ఎంపిక జరిగింది. తాజా ప్రకటనతో మొత్తం తొమ్మిది పార్లమెంటు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది.

కష్టకాలంలో కాంగ్రెస్ ఉనికిని కాపాడాం

పదేళ్లుగా కేసీఆర్ ఆధిపత్యాన్ని ఎదుర్కొన్నాం.. మెదక్ లోక్‌సభ టికెట్ నాకు ఇవ్వండి

» నేనూ నా భర్త జగ్గారెడ్డి గెలిపించుకొస్తాం

» దీపాదాస్ మున్షీని కోరిన నిర్మలా జగ్గారెడ్డి

హైదరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): "గడిచిన పదేళ్లుగా కేసీఆర్ ఆధిపత్యాన్ని ఎదుర్కొంటూ మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కాపాడుకొచ్చాం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తే.. పోటీ చేసి ఉనికిని చాటాం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ టికెట్‌ను నాకు ఇస్తే.. గెలిపించి ఇస్తామ"ని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి సతీమణి, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కోరారు. మెదక్ లోక్‌సభ స్థానంలో గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ గెలవలేదని, బీసీ మహిళ అయిన తనకు టికెట్ ఇస్తే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి 13 నియోజకవర్గాలకు చెందిన డీసీసీల అధ్యక్షులు, పార్టీ ఎమ్మెల్యేలు, గతంలో పోటీ చేసిన అభ్యర్థులతో బుధవారం గాంధీ భవన్‌లో దీపాదాస్ మున్షీ సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో నిర్మలా జగ్గారెడ్డితో సమావేశమైనప్పుడు ఆమె స్థానికంగా తాను, తన భర్త జగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీని ఎలా కాపాడుకుంటూ వచ్చిందీ వివరించారు. జిల్లాలో గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబ ఆధిపత్యాన్ని ఎదుర్కొంటూ వస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను బీఆర్ఎస్‌లో చేర్చుకుందని గుర్తుచేశారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు మెదక్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తే.. పార్టీ ఉనికిని చాటేందుకు తాను పోటీ చేశానన్నారు. మెదక్‌లో కాంగ్రెస్‌కు ఉన్న ప్రజాప్రతినిధుల కంటే అదనంగా 9 ఓట్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇప్పుడు మెదక్ సీటు కోసం చాలామంది వస్తున్నారని, కష్టకాలంలో పార్టీని కాపాడుకుంటూ వచ్చిన తమకు టికెట్ కేటాయించాలని కోరారు. బాగారెడ్డి తర్వాత గడిచిన 30 ఏళ్లలో మెదక్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరూ గెలవలేదని, తనకు మెదక్ టికెట్ కేటాయిస్తే తాను, తన భర్త జగ్గారెడ్డి కలిసి గెలిపించుకుని వస్తామన్నారు. నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ తన అభ్యర్థనపై అధిష్ఠానం సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నానని చెప్పారు. జగ్గారెడ్డి సైతం దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులను కలిసి తన భార్యకు మెదక్ టికెట్ ఇవ్వాలని కోరారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జిల్లాలో ఎలా కాపాడుకుంటూ వచ్చిందీ, సంగారెడ్డిలో రాహుల్ సభను, భారత్ జోడో యాత్రను విజయవంతంగా నిర్వహించిన తీరును వివరించారు.



రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశం

బీజేపీకి లేదు

» పడగొట్టుకుంటే మీరే బాధ్యులు:లక్ష్మణ్

హైదరాబాద్, ముషీరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తాము రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కోరుకోవడం లేదని బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ తెలిపారు. 8 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేస్తుందంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బుధవారం ఓ ప్రకటనలో అలాగే ముషీరాబాద్‌లోని కమ్యూనిటీ హాల్‌లో జరిగిన మోదీ పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమంలో స్పందించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. "కాంగ్రెస్ నేతలు.. వారంతట వారే తగవు పడి ప్రభుత్వాన్ని పడగొట్టుకుంటే బాధ్యత వారిదే" అని వ్యాఖ్యానించారు. చచ్చిన పామైపోయిన.. బతికి బట్టగట్టే పరిస్థితే లేని బీఆర్ఎస్ పార్టీని బతికించే అగత్యం బీజేపీకి లేదన్నారు. బీఆర్ఎస్‌తో కలిసి బీజేపీ కుట్ర పన్నుతోందంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఈమేరకు స్పందించారు. మా ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే కాపాడతారని సీఎంయే పేర్కొంటూ ప్రభుత్వం పడిపోతుందని ఎందుకు భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటయ్యాయని వారి మాటల్లోనే అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల, ఆ పార్టీ విధానాల పట్ల రేవంత్‌రెడ్డికి విశ్వాసం ఉంటే.. ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని ప్రకటించాలని సవాల్ విసిరారు.

స్వార్థం కోసమే విమోచన దినం:తమ్మినేని

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ జారీ చేయడాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఇది చరిత్రను వక్రీకరించడమే అని బుధవారం పేర్కొన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ నోటిఫికేషన్ విడుదల చేశారని, తక్షణమే దానిని ఉపసంహరించుకోవాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

అరుణకు సై.. జితేందర్‌కు నై!

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ సీటు కేటాయించగా అక్కడ ఆయన ఓటమి పాలయ్యారు. పైగా డీకే అరుణకు టికెట్ ఇస్తేనే గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని బీజేపీ పెద్దలు భావించినట్లు సమాచారం. ఆదిలాబాద్ నుంచి సిటింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని మూడు రోజుల పార్టీలో చేరిన గోడెం నగేశ్‌కు టికెట్ ఇవ్వడం చర్చనీయాంశమైంది. 2014లో నగేశ్ బీఆర్ఎస్ తరఫున ఆదిలాబాద్ నుంచి ఎంపీగా గెలిచారు. 2019లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు చేతిలో ఓటమిపాలయ్యారు. కాగా ఆదిలాబాద్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు సోయం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారని, ఇదే ప్రభావం చూపించదనే చర్చ నడుస్తోంది. ఇదివరకే మొదటి జాబితాలో తెలంగాణ నుంచి తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో మొత్తం 17 స్థానాలకు గాను 15 స్థానాల్లో అభ్యర్థులను అభ్యర్థులను ప్రకటించినట్లయింది. వీరిలో ఇద్దరు మహిళా అభ్యర్థులు మాధవీలత (హైదరాబాద్), డీకే అరుణ (మహబూబ్‌నగర్) ఉన్నారు.

పెండింగ్‌లో ఖమ్మం, వరంగల్ స్థానాలు

తెలంగాణ నుంచి బీజేపీ ప్రకటించాల్సిన స్థానాలు ఇక రెండే రెండు ఉన్నాయి. ఖమ్మం, వరంగల్! మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కుమారుడు మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ఇటీవలే బీజేపీలో చేరారు. ఖమ్మం లోక్‌సభ నుంచి వెంకట్రావ్ బరిలో ఉంటారని ప్రచారం జరిగింది. రెండో జాబితాలో ఆయన పేరును ప్రకటిస్తారనీ పార్టీ వర్గాలు చెప్పాయి. చివరి నిమిషంలో ఆయన పేరును జాబితాలో చేర్చలేదు. బీఆర్ఎస్ నుంచి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ కీలక నేత బీజేపీలో చేరనున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఖమ్మం స్థానాన్ని పెండింగ్‌లో పెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక వరంగల్ నుంచి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను రంగంలోకి దింపాలని బీజేపీ చూసింది. ఆయనతో చర్చలు కూడా జరిపింది. రమేశ్ బుధవారం పార్టీలో చేరతారని ప్రచారం జరిగింది. చివరి నిమిషంలో తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని ఆయన ప్రకటించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఆరూరి సమావేశమయ్యారు. వీటన్నింటి నేపథ్యంలో వరంగల్ నుంచి మాజీ ఐపీఎస్ కృష్ణ ప్రసాద్ అభ్యరిత్వాన్ని దాదాపుగా ఖరారు చేసినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి.





రెండో జాబితాలో గడ్కరీ, గోయల్, అనురాగ్ ఠాకూర్‌కు

ఓవరాల్‌గా రెండో జాబితాలో నితిన్ గడ్కరీ (నాగపూర్), ప్రహ్లాద్ జోషి (ధార్వాడ్), పీయూష్ గోయల్ (ముంబై నార్త్), అనురాగ్ ఠాకూర్ (హమిర్‌పూర్) తోపాటు మాజీ ముఖ్యమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్(కర్నాల్), త్రివేంద్రసింగ్ రావత్ (హరిద్వార్), బసవరాజ్ బొమ్మై (హవేరీ)కి చోటు దక్కింది. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప తనయుడు రాఘవేంద్ర.. షిమోగ లోక్ సభ స్థానం నుంచి బరిలో నిలవనున్నారు. దేశంలో మొత్తం 543 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. తొలి జాబితాలో 195 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో మొత్తంగా 267 స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించినట్లయింది. ఎన్డీఏ కూటమిలో భాగంగా కొన్ని రాష్ట్రాల్లో అవగాహనతో ముందుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది. అందులో భాగంగానే మరి కొన్ని రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్నాయి. పొత్తులు, పోటీ చేసే సీట్ల విషయంలో పూర్తి అవగాహనకు వచ్చాక మిగిలిన లోక్‌సభ స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటించాలని బీజేపీ భావిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

16న నాగర్‌కర్నూల్‌కు మోదీ

భారీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు

నాగర్‌కర్నూల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగర్‌కర్నూల్ పర్యటన ఖరారయింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని శనివారం(16న) నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారు. దాంతో వెలమ సంఘం కల్యాణ మండపం పక్కన భారీ బహిరంగ సభ నిర్వహణకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రముఖ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సన్నాహక సమావేశం జరిగింది. మోదీ తొలిసారి నాగర్‌కర్నూల్‌కు వస్తున్నందున భారీ ఎత్తున జనసమీకరణ చేయాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. అందుకోసం సభకు ఉమ్మడి జిల్లా, బీజేపీ పట్టు ఉన్న ప్రాంతాల నుంచే కాకుండా మిగతా నియోజకవర్గాల నుంచి కూడా జనాన్ని తరలింగే ప్రయత్నాలు చేస్తున్నారు.

విమోచన గెజిట్‌పై బీజేపీ హర్షం

సెప్టెంబరు 17ను హైదరాబాద్ విమోచన దినంగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలకు కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ స్వాతంత్ర్యం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయులందరికీ సరైన గౌరవం దక్కిందన్నారు. అభినవ సర్దార్ వల్లభాయ్ పటేల్ అయిన అమిత్ షా నేతృత్వంలో సెప్టెంబరు 17న విమోచన దినోత్సవంగా నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ కావడం చారిత్రాత్మకమన్నారు.

మర్కోడుకు బస్ సౌకర్యం కల్పించండి

ఆళ్లపల్లి, మార్చి 13: ఇల్లెందు ఆర్టీసీ డిపో నుంచి మర్కోడుకు బస్సు సౌకర్యం కల్పించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఆళ్లపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. బుధవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్కోడులోని ఓ శుభ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే అయ్యాక ఆయన మొదటిసారి ఆళ్లపల్లి మండలం రావడంతో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రామనర్సయ్య, పడిగినమ్మయ్య, తాళ్లపల్లి వెంకన్న, చిరంజీవి, నాగేష్, గౌరమ్మ, సత్యనారాయణ, కృష్ణబాబు, రణం శేఖర్, రమేష్, వెంకన్న, రాము, రవి, భరత్‌తో పాటు పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఇల్లందు ఆర్టీసీ డిపో నుంచి మర్కోడుకు రెండు వేళల్లో బస్సు సౌకర్యం కల్పిస్తే, ఉద్యోగులకు, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు ఎమ్మెల్యేకు వివరించారు.

ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు: పాయం

కరకగూడెం, మార్చి 13: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తుందని ప్రతి ఇంటికి ప్రభుత్వం ఇచ్చిన హామీ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 25 మంది లబ్ధిదారులకు రూ.25లక్షల 40వేల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అప్పులు మిగిల్చిందని అంతేకాక ప్రభుత్వం అందించిన పథకాలను దళారుల పెత్తనంతో అర్హుల నుంచి డబ్బులు వసూలు చేసిన గటనలు ఉన్నాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పథకాలలో ఎవ్వరికి డబ్బులు ఇవ్వవద్దని అటువంటి వారి వివరాలతో నేరుగా నా దృష్టికి తీసుకరావాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలలో ఐదు గ్యారంటీలు అమలు అయ్యాయని తెలిపారు. ఎన్నో ఏళ్ల తరబడి ఉన్న పులుసుబొంత త్వరలోనే ప్రారంభం కానుందని మణుగూరు సభలో సీఎం రేవంత్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగ ప్రసాద్, డీటీ సంధ్య, వైస్ ఎంపీపీ ఎలిపెద్ది శైలజ, మాజీ సర్పంచులు పోలెబోయిన శ్రీవాణి, నాగేశ్వరావు, కుంజ వసంతరావు, ఆర్ఐలు హుస్సేన్, రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇక్బాల్ హుస్సేన్, జలగం కృష్ణ, అత్తె ముకుందం, గొగ్గలి రవి, చందా రత్తమ్మ, సాగర్, నాగబండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పినపాకలో..

పేద కుటుంబాలకు అండగా..

పినపాక: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజారంజక పాలన అందిస్తున్నదని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పినపాక మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై, చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, సీఎం రేవంత్‌రెడ్డి పారదర్శక పాలనలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన కార్పోరేషన్ల హామీని నేరవేర్చుతూ, 16 కార్పోరేషన్లను ఏర్పాటు చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మలకు, సీతక్కకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కంకణబద్ధుడనై ఉన్నానని అన్నారు. కార్యక్రమంలో పినపాక తహశీల్థార్ తోట సూర్యనారాయణ, ఎంపీడీఓ రాఘవరపు రామకృష్ణ, ఆర్ఐలు కే బాలకృష్ణ, వీరభద్రం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగిరెడ్డి


కరకగూడెంలో చెక్కును అందజేస్తున్న పాయం

వెంకటరెడ్డి, కొర్సా ఆనంద్, పేరం వెంకటేశ్వరరావు, పరిమి వెంకటేశ్వర్లు, లక్ష్మీరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తోలెం కళ్యాణి, అర్జున్, భిక్ష పతి, కొండేరు పుల్లయ్య, వంకా నర్సింహారావు, గీద కొండలరావు, శ్రీను, సాంబ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచు తేజావత్ సూర్యం గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సూర్యం ఉమ్మడి మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ సర్పంచుగా మూడు సార్లు పని చేశారు. విషయం తెలుసుకున్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు బుధవారం సూర్యంను పరామర్శించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, అనంద్, వెంకటేశ్వర్లు, సీతారామిరెడ్డి, దామోదర్‌రెడ్డి, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమల ద్వారా ఉపాధి: పీవో

మణుగూరు, మార్చి 13 : ఆదివాసీ గిరిజన యువత చిన్న చిన్న పరిశ్రమలను స్వశక్తితో ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధిని పొందటమే కాకుండా పది మందికి ఉపాధి అవకాశాలను కల్పించడం అభినందనీయమని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కొత్త కొండాపురం గ్రామంలో కోడి నాగరాజు అనే నిరుద్యోగ యువకుడు తన మిత్రులతో కలసి రూ.16 లక్షల పెట్టుబడితో ఏర్పాటు చేసిన నాటుకోళ్లఫారంను పివో ముఖ్య అతిధిగా హజరై ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా సమర్ధత గల యువకులు ఇలా స్వయం ఉపాధి పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని పలువురికి ఉపాధి అందివ్వడం శుభ పరిణామమన్నారు. ఇతరులు నాగరాజును స్పూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్థులతో పాటు కలసి పీవో, తహశీల్థార్ రాఘవరెడ్డి మొక్కలను నాటారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ వేణుగోపాల్ , సబ్ ఇంజనీర్ లారెన్స్, అనీల్ పాల్గొన్నారు.


కోళ్ల ఫారాన్ని ప్రారంభిస్తున్న పీవో ప్రతీక్ జైన్

గృహాల పనులు పూర్తి చేయాలి

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ నివాస గృహ సముదాయలలో అసంపూర్తిగా ఉన్న గృహాల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న నివాస గృహాలలో జరుగుతున్న పనులను పరిశీలించి గృహాలు పనులు ఎంత వరకు పూర్తయినవి సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులకు సూచనలు ఇస్తూ ఎంతో వ్యయంతో నివాస గృహాలు ప్రారంభించి అసంపూర్తిగా వదిలివేయడంతో అవి దేనికీ పనికి రాకుండా పోతున్నాయని అన్నారు. తక్షణమే వాటిని పూర్తి చేసి ఇండ్లను అందుబాటులోకి తేవాలన్నారు. అలాగే ఐటీడీఏ కార్యాలయంపైన అసంపూర్తిగా ఉన్న భవనాల పనులు ప్రారంభించి తొందరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ పరిసరాలను ప్రతి రోజు శుభ్రం చేయించి కార్యాలయానికి వచ్చే ప్రజలకు సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఆర్వోఎఫ్ఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


అసంపూర్తి గృహాలను పరిశీలిస్తున్న పీవో

ఎమ్మెల్యే జారేకు సన్మానం

అశ్వారావుపేట, మార్చి 13: మున్నూరు కార్పొరేషన్ ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగ మున్నూరు కాపు సంఘ నాయకులు బుధవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసారు. అశ్వారావుపేటకు చెందిన మున్నూరు కాపు సంఘ నాయకులు సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, తాడేపల్లి రవి, ఉపేం ద్ర, డేగల రాము, బండారి శ్రీను, రఘురామ్, నాగబాబు, అప్పారావు, కట్టా శ్రీను తదితరులు గండుగులపల్లిలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. ఆయనను సత్కరించారు. కార్పొరేషన్‌తో పేదలైన మున్నూరు కాపు లెందరికో ఉపయోగకరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేసారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు

అశ్వాపురం, మార్చి 13: జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ ఏపీడీ వివేక్‌రాయ్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధిహామీ పథకం 15వ విడత మండల ప్రజా వేదికలో ఆయన మాట్లాడారు. ముందుగా గ్రామపంచాయతీల వారీగా సామాజిక తనిఖీ నివేదికలను తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికకు వివరించారు. ఈసందర్భంగా మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామపంచాయతీలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.లక్షల్లో ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయినట్లు తనిఖీ సిబ్బంది పేర్కొన్నారు.ఈసందర్భంగా ఏపిడి మాట్లాడుతూ అవకతవకలపై జిల్లా తనిఖీ బృందంతో రీసర్వే చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కాగా సమగ్ర విచారణ జరిపించాలని గ్రామస్థులు ఏపిడికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ముత్తినేని సుజాత, ఈజీఎస్ ఏపీవో పాల్గొన్నారు.

కోడ్ ముందే పీఆర్‌సీ ప్రకటించాలి

కొత్తగూడెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఎలు, పీఆర్‌సీని పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ముందే ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. వెంకటేశ్వరరావు, బి.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెనగడపలో జరిగిన పీఆర్‌టీయూ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 317 జీవోపై సలహా అవకాశాన్ని కల్పించడాన్ని స్వాగతిస్తునే 4డీఎలు పెండింగ్ ఉంచడం బాధాకరమన్నారు. ఎన్నో ఆశలతో తెచ్చుకున్న ఈ ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులను విస్మరించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో చుంచుపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జి. చంద్రశేఖర్, ఎస్‌కే. రంజన్‌మియా, హెచ్‌ఎం సీత, బాధ్యులు మధుసూధన్ రావు, హరి ప్రసాద్, సరస్వతి, సూర్యకాంతం, రాము తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలను ఆదివాసీలతో భర్తీ చేయాలి

భద్రాచలం, మార్చి 13: జిల్లాలో ఈఎంఆర్ఎస్ పాఠశాలలో ఉన్నటువంటి ఖాళీ ఉద్యోగాలను ఆదివాసీ నిరుద్యోగులతోనే భర్తీ చేయాలని ఆదివాసీ సంక్షేమపరిషత్ డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లుదొర భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏకలవ్య మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు, హాస్టల్ వార్డెన్ మ్యాట్రిన్ ఎలక్ట్రిషన్ సెక్యూరిటీ గార్డు, అటెండర్ పోస్టులను ఆదివాసీలతోనే భర్తీ చేయాలన్నారు. ఆదివాసీ నిరుద్యోగులు ఆశగా ఎదురు చూఏస్తున్నారని తక్షణమే భర్తీ చేయాలని కోరారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

భద్రాచలం, మార్చి 13: టీఎస్ ఆర్టీసీ భద్రాచలం డిపోలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో అసిస్టెంట్ మెకానిక్ వర్కర్స్‌గా పని చేస్తున్న కార్మికులకు మూడు నెలల పెండింగు వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికులు, ఆర్టీసీ రీజినల్ మేనేజరుకు ఫోను ద్వారా ఫిర్యాదు చేయడంతో పాటు భద్రాచలం డిపో మేనేజరుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో అవుట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు నెల నెల వేతనాలు చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ కాంట్రాక్టరు వేతనాలు చెల్లించడం లేదన్నారు. గత మూడు రోజులుగా ఈ విషయంపై కాంట్రాక్టరును సంప్రదించేందుకు ఫోను ద్వారా ఎన్ని ప్రయత్నాలు చేసినా స్పందించడం లేదన్నారు. కావున తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయు నాయకులు గడ్డం స్వామి, ఎర్రబాబు, నరేష్, రంగారెడ్డి, చలపతిరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు వితరణ

భద్రాచలం, మార్చి 13: భద్రాచలంలోని ఆర్టీసీ అవుట్‌గేటు ఆటో అడ్డాలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.7 వేల నగదును బుధవారం భద్రాచలం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఆటో యూనియన్ నాయకులు అందజేశారు. ఈ నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జూలూరుపాడు, మార్చి13: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 1930 సైబర్ కాల్ సెంటర్‌కి లేదా 100కి డయల్ చేసి సమాచారం అందించాలని హెడ్ కానిస్టేబుల్ దయానంద్ తెలిపారు. జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై జీవన్ రాజు ఆదేశాల మేరకు బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జూలూరుపాడులోని చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద సైబర్ నేరాల పట్ల ప్రజలకు, ఆటో కార్మికులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరలు అధికమవుతున్నాయని అన్నారు. ఎవరైన ఫోన్ చేసి బ్యాంక్ ఖాతా, ఆధార్ వివరాలను అడిగితే ఇవ్వవద్దని, మేసెజ్‌లకు స్పందించవద్దని సూచించారు. గ్రామాలలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటే పోలీసులకు సమాచారాన్ని అందించాలని కోరారు.

బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికలు చేయాలి

మణుగూరుటౌన్, మార్చి 13: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాకు నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు బొగ్గు ఉత్పత్తికి నిర్ధిష్టమైన ప్రణాళికలు చేయాలని సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన ఏరియా అధికారులతో కలిసి పీకేఓసీ-2, పీకేఓసీ-4, మణుగూర ఓపెన్ కాస్టలలో పర్యటించి వ్యూ పాయింట్‌ల నుంచి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరియా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో రక్షన సూత్రాలను పాటిస్తూ 2023-24 సంవత్సర లక్ష్యం 119.5 లక్షల టన్నులకు మించి బొగ్గును ఉత్పత్తికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా 2024-25 సంవత్సర బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు సంసిద్ధులవ్వాలని సూచించారు. ఉత్పత్తి ప్రక్రియల్లో వాయు కాలుష్య నివారణకు దుమ్ము, దూళి నియంత్రణకు తప్పనిసరిగా తగిన చర్యలు నిత్యం తీసుకోవాలని ఆఫ్‌లోడింగ్ కంపెనీలైన దుర్గ, మహాలక్ష్మీ యాజమాన్యాలను ఆదేశించారు. పని ప్రదేశాల్లో నిలవ నీటిని త్వరితగతిన తీసవేసి వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని సూచించారు.


ఓసీ గనులను పరిశీలిస్తున్న డైరెక్టర్

బ్రహ్మోత్సవాల్లో డైరెక్టర్

మణుగూరు ఏరియాలోని పీవీ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుదవారం సతీ సమేతంగా డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జీ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు 'అమ్మకోసం' ప్రారంభం: డీఎంహెచ్‌వో

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 13: ప్రసవం అనంతరం కొందరు బాలింతలు వివిధ కారణాలతో రోగాల బారినపడి అంతు చిక్కని సమస్యలతో మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకోవడంతో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేదుకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మకోసం అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీనిని గురువారం ప్రారంభిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ బాలింతలు తమ ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. గర్భం దాల్చింది మొదలు వారి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకొని వైద్య పరీక్ష నిర్వహించి మందులను అందించడం జరుగుతుందని అన్నారు.

సిబ్బందికి ట్యాబ్‌ల పంపిణీ

ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు గాను బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష డిఎస్ఆర్సీ కౌన్సిలర్లకు, ల్యాబ్ టెక్నీషియన్‌లకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నుంచి వచ్చిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంటర్ పని తీరును మెరుగు పరచడానికి ఈ ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని, ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను తప్పని సరిగా ఆన్‌లైన్ చేయాలని తెలిపారు.


ట్యాబ్‌లను అందజేస్తున్న డీఎంహెచ్‌వో

విద్యార్థులను సరైన మార్గంలో నడిపించాలి

జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి

కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 14 : విద్యార్థులను సరైన మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటేశ్వరచారి అన్నారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడిని అధిగమించేందుకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్‌హాలులో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పరీక్షలను ఒత్తిడితో కాకుండా సంతోషంగా రాయాలని, పరీక్షా ఫలితాలే జీవితం కాదని ఎంతో జీవితం ముందుందని, దీన్ని గుర్తించి పిల్లలని వారి వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరీక్ష పే చర్చ కార్యక్రమంలోని పిల్లలకు అవసరమైన పరీక్షామంత్రాలను, పిల్లలపై వచ్చిన ఒత్తిడిని తగ్గించానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన చర్యలను సబ్జెక్టు నిపుణులు అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎ. నాగరాజశేఖర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తల్లిదండ్రులకు, పిల్లలకు వివరించారు. అనంతరం సాంఘీకశాస్త్ర పాఠ్య పుస్తక రచయిత ఉండేటి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలకు మంచి, చెడుల విచక్షణ జ్ఞానాన్ని తెలుసుకునే సామర్థ్యాలు అందించాలని, అలాగే పిల్లల హక్కులు కాలరాసే అధికారం ఎవరికి లేదని, యుక్త వయస్సు పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్నేహపూర్వక వాతావరణంలో వ్యహరించి వారి సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తగా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ఎస్‌కే. సైదులు, ప్లానింగ్ కో ఆర్డినేటరు ఎన్. సతీష్‌కుమార్, బాలిక విద్య కో ఆర్డినేటరు జె. అన్నామని, వివిధ పాఠశాలల నుంచి 300మంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

పోలీసు అధికారులతో మెజిస్ట్రేట్ సమీక్ష

మణుగూరుటౌన్, మార్చి 13: మణుగూరు సబ్ డివిజన్ పోలీస్ శాఖ అధికారులతో మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పోలీస్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్ క్రైం వివరాలు తెలుసుకుని వాటిలో రాజీ పడదగిన కేసుల ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలీస్ స్టేసన్ల పరిధిలో రాజీ పడదగిన కేసుల్లో కక్షిదారుల మధ్య సయోద్య కుదిర్చి రాజీ పడేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా ఆయా స్టేసన్ల పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారంలో సంబంధిత స్టేసన్ల అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రజలకు లోక్ అదాలత్‌లపై అవగాహన కలిగే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏరియా సింగరేణి యాజమాన్యం సహకారంతో కోర్టు ఆవరణలోని పిచ్చి మొక్కలు, మైదానాన్ని చదును చేసే పనులను మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు బుదవారం పరిశీలించారు. మణుగూరు కోర్టు ఆవరణలో 16న నిర్వహించే మెగా లోక్ అదాలత్, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించబోయే జ్యుడిషియల్ లైబ్రరీ కార్యక్రమానికి జిల్లా జడ్జీ రానున్నారు. ఈ నేపద్యంలో కోర్టు ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగింతోపాటు చెత్త చెదారాన్ని పరిశుభ్రం చేసే పనులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సర్వేశ్వరరావు, విజయరావు, రుద్ర వెంకట్, సాంబ, అన్వేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న మెజిస్ట్రేట్

ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు పొందాలి

అశ్వారావుపేట, మార్చి 13: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఓటును నమోదు చేసుకునేలా ఆయా రాజకీయ పార్టీలు గ్రామాలలో అవగాహన కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి డి.వేణుగోపాల్ కోరారు. బుధవారం అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీలతో అదనపు కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన ఓట్లను గుర్తించాలని, డబుల్ ఓట్లను గుర్తించినట్లయితే ఫారం-7 ద్వారా బూత్ స్థాయి అధికారులతో విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోబడతాయని సూచించారు. కార్యక్రమంలో వివిధ మండలాల తహసీల్దార్‌లు కృష్ణ ప్రసాద్, జగదీశ్వర ప్రసాద్, సంధ్యా రాణి, నాయబ్ తహసీల్దార్ సీహెచ్‌వి రామకృష్ణ, రాజకీయ పార్టీల నాయకులు కె పుల్లయ్య, మొగళ్ళపు చెన్నకేశవరావు, కట్రం స్వామి, సయ్యద్ సలీం, గన్నిన రామకృష్ణ, సత్యవరపు సంపూర్ణ, బండారు చంద్రశేఖర్, పొదిలి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: కూనంనేని



కార్యక్రమంలో మాట్లాడుతున్న కూనంనేని

కొత్తగూడెం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని తెలిపారు. బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులో అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలపడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్నివార్డుల్లో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండ శాశ్విత పరిష్కార దిశగా పనులు చేపట్టామన్నారు. అర్హులైన పేదలందరికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని ప్రకటించారు. అన్నివార్డులను సమానంగా అభివృద్ధి చేసేందుకు నిధులను కేటాయిస్తామని తెలిపారు. ప్రజలు ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ శేషాంజనేయస్వామి, మాజీ వైస్‌చైర్మన్ సాబీర్‌పాషా, వివిధ వార్డు కౌన్సిలర్లు అనీల్, నేరళ్ల సమ్మెయ్య, కంచర్ల జమలయ్య, సీపీఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, వహీం, జహీర్, గుత్తుల శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సాంకేతిక సిబ్బంది

దుమ్ముగూడెం, మార్చి 13: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణా ఈ పంచాయతీ సాంకేతిక సిబ్బంది బుధవారం ఎంఎల్‌ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావును కలిసారు. తొలుత ఎంఎల్‌ఏను శాలువాతో సన్మానించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్లకు పే స్కేల్ అమలు, కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పే స్కేలు అమలు, ఉద్యోగ భద్రత, మహిళా ఉద్యోగులకు వేతనాలతో కూడిన ప్రసూతి శెలవు తదితర డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంఎల్‌ఏ వారికి హామీ ఇచ్చారు.

క్రమశిక్షణతో కూడి విద్యతోనే ఉన్నత శిఖరాలకు

మణుగూరురూరల్, మార్చి 13: విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే క్రమ శిక్షణతో కూడిన విద్యతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుదవారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్‌లోగల బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

క్రికెట్ టోర్నీలో బీటీపీఎస్‌కు మూడో స్థానం

మణుగూరుటౌన్, మార్చి 13: భూపాలపల్లి జిల్లా చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో ఐదు రోజులుగా జరుగుతున్న టీజీ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో మణుగూరు బీటీపీఎస్ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సంరద్భంగా బీటీపీఎస్ సీఈ బిచ్చన బుధవారం జట్టు సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన బీటీపీఎస్ సంస్థ క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందని అన్నారు. క్రీడాకారులను విశేషంగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. క్రీడాకారులు మరింత మెరుగైన ప్రతిభను కనబర్చాలని అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ మెలగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ కల్తి నరసింహారావు, కమాండెంట్ బాబురావు, డీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్కార్పియో వాహనంలో మంటలు

భద్రాచలం మార్చి 13: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న స్కార్పియో వాహనంలో బుధవారం హటాత్తుగా మంటలు రావడం సంచలనమైంది. ఆవరణలో నిలిపి ఉంచిన స్కార్పియో వాహనం నుంచి ఆకస్మాత్తుగా పొగలు రావడంతో పక్కనే ఉన్న సిబ్బంది అప్రమత్తమై వచ్చి పరిశీలించగా వాహనంలో మంటలు ఎగసిపడుతున్నాయి. ఈ క్రమంలో నీటితో మంటలను అదుపులోకి తెచ్చారు. అనంతరం వాహనాన్ని షెడ్‌కు తరలించారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్లనే జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ వాహనం ప్రాజెక్టు అధికారి 25 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిందని ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు.